70 రోజుల్లో 23 వేల ఉద్యోగాలు

- ప్రతి నియోజకవర్గంలో 'గురుకుల కాంప్లెక్స్'ల నిర్మాణం
- అన్నిచోట్ల స్థలాలు చూడాలని రాష్ట్ర సీఎస్‌ను ఆదేశిస్తున్నా..
- అన్ని కులాల విద్యార్థులకు అందులోనే విద్యాభ్యాసం
- త్వరలో మెగా డీఎస్సీ వేస్తం.. మూతపడిన స్కూళ్లు తెరిపిస్తం
- త్వరలో గ్రూప్-1 పరీక్ష నిర్వహిస్తం
- గురుకుల ఉద్యోగ నియామక పత్రాల పంపిణీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

గురుకుల ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థికి నియామకపత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన 70 రోజుల్లోనే సుమారు 23 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. 3,625 రోజులు పరిపాలించిన కేసీఆర్ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం ఎల్బీ స్టేడియంలో గురుకుల ఉద్యోగాల కోసం ఎంపికైన 2,150 మందికి ఆయన నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 30 లక్షల మంది నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం తమ హయాంలో ఉద్యోగాలు కల్పిస్తామని పునరుద్ఘాటించారు. యూపీఎస్సీ తరహాలో త్వరలోనే టీఎస్‌పీఎస్సీ ద్వారా గ్రూప్-1 పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. మూతపడిన సింగిల్ టీచర్ స్కూళ్లను మళ్లీ తెరిపించేందుకు మెగా డీఎస్సీ వేస్తామని ప్రకటించారు. తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా 'గురుకుల కాంప్లెక్స్'లు నిర్మిస్తామని సీఎం రేవంత్ వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యార్థులు వాటిల్లోనే కలిసి చదువుకుంటారని తెలిపారు. సుమారు 20 ఎకరాల్లో ఒకే ప్రాంగణంలో నాలుగు గురుకులాలను నిర్మిస్తామని, ఇందుకు అన్ని నియోజకవర్గాల్లో స్థలాలను ఎంపిక చేయాలని వేదిక మీద నుంచి సీఎస్ శాంతికుమారికి ఆదేశాలు జారీ చేశారు. ఇట్లాంటి కాంప్లెక్స్‌లను పైలట్ ప్రాజెక్టుగా తొలుత కొడంగల్‌లో నిర్మిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం విద్యపై 6శాతం మాత్రమే నిధులు ఖర్చు చేస్తే తాము 10-12 శాతం ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని చెప్పారు. గ్రూప్-4 ఉద్యోగాలకు కూడా త్వరలోనే నియామక పత్రాలు అందిస్తామని తెలిపారు. సొంత భవనాల్లో గురుకులాలు నిర్మించేందుకు అన్ని అనుమతులు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. మెస్ చార్జీలను ఎప్పటికప్పుడు చెల్లించేందుకు 'ఈ-చానెల్'ను తీసుకొస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. తమది చేతల ప్రభుత్వమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించబోతున్న వారికి సీఎస్ శాంతికుమారి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్, ఐఏఎస్‌లు రోనాల్డ్ రోస్, హన్మంతరావు, గురుకులాల అధికారులు హన్మంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కష్టం.. రేవంత్ ఖాతాలోకి!

- గత ప్రభుత్వ హయాంలోనే నోటిఫికేషన్లు, పరీక్షలు
- కోడ్ రాకతో ఆగిన ఉద్యోగ నియామకాలు
- కేసీఆర్ ఉద్యోగాలకు రేవంత్ సంబురాలు
- మొన్న నర్సింగ్, నిన్న కానిస్టేబుల్, నేడు గురుకుల నియామక పత్రాల పంపిణీ
- 2నెలల్లో ఒక్క నోటిఫికేషన్ వెయ్యలే
- 23 వేల ఉద్యోగాలిచ్చినట్టు హడావుడి

కేసీఆర్ కొలువులు కాంగ్రెస్ కాగితాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలుదాటినా ఒక్క ఉద్యోగానికి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఒక్క ఉద్యోగానికి పరీక్ష సైతం నిర్వహించలేదు. కానీ, 23 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు పబ్లిసిటీ చేసుకుంటున్నది. 'అధికారంలోకి వచ్చి 70 రోజులు పూర్తవ్వకముందే.. ఏకంగా 23 వేల ఉద్యోగాలు ఇచ్చా'మని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న బిల్డప్ చూస్తే.. 'మందికి పుట్టినా.. మన బిడ్డే' అన్నట్టున్నది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు.. రేవంత్ సర్కార్ నియామక పత్రాలు ఇచ్చి ప్రచారం చేసుకుంటున్నది. 'బర్రె ఎక్కడ కడితే ఏముంది.. ఈనేది మన దొడ్లోనేగా' అన్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉన్నది. కాంగ్రెస్ సర్కారు ఇలా చెప్పుకోవడానికి సిగ్గుండాలని తెలంగాణ ఉద్యమకారులు, నిరుద్యోగులు మండిపడుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో లక్షా 60 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలిచ్చింది. 40 వేలకుపైగా ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడి చేస్తుండగా.. ప్రభుత్వం మారడం కాంగ్రెస్‌కు కలిసివచ్చింది. కేసీఆర్ ప్రభుత్వంలో చేపట్టిన పరీక్షల అభ్యర్థులకు నియామక పత్రాలిచ్చి ఆ క్రికెట్ రేవంత్‌రెడ్డి తన ఖాతాలో వేసుకుంటున్నారు.

నర్సింగ్ ఉద్యోగాలు మొదలు..

కేసీఆర్ ప్రభుత్వం 2022 డిసెంబర్‌లోనే సుమారు ఏడు వేల నర్సింగ్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. సజావుగా పరీక్షలు నిర్వహించింది. అభ్యర్థులను ఎంపిక చేసి, తుది ఫలితాలు విడుదల చేయాల్సి ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో విడుదలలో జాప్యం జరిగింది. ఈ పోస్టులకు ఎలాంటి కోర్టు కేసులు లేకపోవడంతో రేవంత్ సర్కార్‌కు కలిసొచ్చింది. గత డిసెంబర్‌లో ఫలితాలు విడుదల చేసి, జనవరి 31 నియామక పత్రాలు అందించి.. 6,956 పోస్టులను తాను ఇస్తానన్న 2 రెండు లక్షల ఉద్యోగాల ఖాతాలో సీఎం రేవంత్‌రెడ్డి వేసుకున్నారు. ఆ తర్వాత సింగరేణిలో 441 కారుణ్య నియామకాలకు కేసీఆర్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వాటి నియామక పత్రాలు అందించేందుకు కూడా ఎన్నికల కోడ్ అడ్డు రావడం, ప్రభుత్వం మారడంతో ఇటీవల ఆ ఉద్యోగుల నియామక పత్రాలు సీఎం రేవంత్‌రెడ్డి అందించారు. వాటిని కూడా తానిస్తానన్న ఉద్యోగాల ఖాతాలో వేసుకున్నారు.

తాజాగా గురుకుల ఉద్యోగాలకు..

2023లో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఆర్ఈఐబీ) ద్వారా 9,210 ఉద్యోగాలకు నియామకాలు చేపట్టింది. గతేడాది ఆగస్టులో పరీక్షలు నిర్వహించింది. వాటికి సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన, తుది జాబితాను ఇటీవల టీఆర్ఈఐబీ విడుదల చేసింది. దీంతో 1,276 పీజీటీ టీచర్లు, 526 లైబ్రేరియన్, 348 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించి.. వాటిని సైతం తాను ఇవ్వాల్సిన 2 లక్షల ఉద్యోగాల ఖాతాలో వేసుకున్నారు. మొత్తంగా కేసీఆర్ హయాంలో చేపట్టిన 22,991 ఉద్యోగాలకు నియామక పత్రాలు అందించి.. రెండ్రోజులు ఎల్బీ స్టేడియంలో పండగ చేసుకుంటున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో మిగిలిన 3,160 పోస్టులకు, గురుకుల ఉద్యోగాల్లో మిగిలిన 7,060 పోస్టులకు కూడా సీఎం రేవంత్‌రెడ్డే మళ్లీ నియామక పత్రాలు అందించి.. మరోసారి తానే ఉద్యోగాలు ఇచ్చినట్టు బిల్డప్ ఇస్తున్నారు.

'కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకు'..

రాష్ట్ర పోలీసు వ్యవస్థను బలోపేతం చేసే క్రమంలో నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్.. 2022 ఏప్రిల్‌లో 16,604 కానిస్టేబుల్, 587 ఎస్సై తత్సమాన ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. వీటిల్లో 587 ఎస్సై ఉద్యోగాలకు విజయవంతంగా ప్రిలిమ్స్, ఫిజికల్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించి గతేడాది ఆగస్టులో నియామకపత్రాలు అందించగా వారు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. 16,604 కానిస్టేబుల్ తత్సమాన ఉద్యోగాలకు బోర్డు విజయవంతంగా అన్ని పరీక్షలు నిర్వహించి.. అక్టోబర్‌లోనే తుది ఫలితాలు విడుదల చేసింది. ట్రాన్స్‌లేషన్ సమస్యపై అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లడంతో.. తుది ఫలితాలు వెలువడే నాటికి ఎన్నికల కోడ్ రావడంతో, ప్రభుత్వం జోక్యం చేసుకోలేకపోయింది. ఇటీవల సుప్రీం కోర్టులో టీఎస్ఎల్‌పీఆర్బీ కేసు గెలువడంతో.. 'కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకు' అన్నట్టు వెంటనే సీఎం రేవంత్ నియామక ప్రతాలు సిద్ధం చేయించారు. వాటిని బుధవారం 13,444 కానిస్టేబుల్ అభ్యర్థులకు అందజేసి.. వాటిని కూడా తాను ఇస్తానన్న 2 లక్షల ఉద్యోగాల ఖాతాలో వేశారు.

ఉద్యోగాల ఘనత కేసీఆర్‌దే

- బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన ఉద్యోగాలకు తానే ఇచ్చినట్టు సీఎం రేవంత్‌రెడ్డి బిల్డప్
- బీఆర్ఎస్ నేతలు గెల్లు, వాసుదేవరెడ్డి

మీడియా సమావేశంలో గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వాసుదేవరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కేసీఆర్ సర్కారు ఇచ్చిన నోటిఫికేషన్ల కొలువులకు ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు పంచుతూ తమ ఘనతగా బిల్డప్ ఇస్తున్నారని బీఆర్ఎస్ నేత, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. ఉద్యోగాలన్నీ తామే ఇచ్చినట్టు ఎల్బీ స్టేడియంలో సభలు నిర్వహించి మరీ కాంగ్రెస్ ప్రభుత్వం పబ్లిసిటీ చేసుకోవడం విడ్డూరంగా ఉన్నదని ఫైరయ్యారు. గురువారం తెలంగాణభవన్‌లో వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోలకు పోజులు ఇచ్చి ఉద్యోగాలన్నీ కాంగ్రెస్ హయాంలోనే వచ్చినట్టు ప్రచారం చేసుకోవడం తగదని మండిపడ్డారు. ఉద్యోగ నియామకాలపై రేవంత్‌రెడ్డికి కనీస అవగాహన లేదని, దమ్ముంటే అసలు ఏ శాఖలో ఎన్ని ఉద్యోగ ఖాళీలు ఉన్నాయో అసెంబ్లీ వేదికగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పరిపాలన నిల్లు.. పబ్లిసిటీ పుల్లు

60 రోజుల రేవంత్‌రెడ్డి పరిపాలన చూస్తుంటే పరిపాలన నిల్లు, పబ్లిసిటీ పుల్లు అన్నట్టుగా ఉన్నదని బీఆర్ఎస్ నేత, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి విమర్శించారు. కేసీఆర్ ఉద్యోగ నియామకాల కష్టాన్ని తన ఖాతాలో వేసుకొని రేవంత్‌రెడ్డి సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటున్నారని మండిపడ్డారు. బీసీ గురుకులాల్లో తొమ్మిది క్యాటగిరీల్లో 8,231 పోస్టులకు గత ఆగస్టులోనే కేసీఆర్ ప్రభుత్వం పరీక్షలు నిర్వహించిందని గుర్తుచేశారు. ఆఖరు నిమిషంలో ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో నియామక ప్రక్రియ నిలిచిందని, ఇప్పుడు వాళ్లకు పోస్టింగ్ ఆర్డర్లు ఇస్తూ.. తమ ప్రభుత్వ ఘనతగా కాంగ్రెస్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు.

సీఎం సభలో నకనక.. నరకయాతన

- గురుకుల విద్యార్థినుల అగచాట్లు
- ఎర్రటి ఎండలో తీవ్ర ఇబ్బందులు
- టాయిలెట్లు సరిపడా లేక చిన్నారులు, మహిళా ఉద్యోగ అభ్యర్థుల అవస్థలు
- ఉన్న ఒక్క టాయిలెట్ కంపుమయం
- సీఎం సభకు.. గురుకుల విద్యార్థులకు ఏం సంబంధమని పలువురి నిలదీత

ఎల్బీ స్టేడియంలో స్వయంగా వాటర్ ప్యాకెట్లు మోసుకొస్తున్న గురుకుల విద్యార్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): గురుకుల ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందించేందుకు ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పెద్దఎత్తున గురుకుల విద్యార్థులను తరలించడంతో వారు నానా అగచాట్లు పడ్డారు. తమ చదువులో భాగంగా హయత్‌నగర్‌లో డాటా సైన్స్, లైఫ్ స్కిల్స్ నేర్చుకుంటున్న వారందరితోపాటు అన్ని జిల్లాల నుంచి గురుకుల విద్యార్థులను గురువారం సీఎం సభకు అధికారులు తరలించారు. సీఎం సభలో జనం కనిపించేందుకు విద్యార్థులకు మధ్యాహ్నం 12 గంటలకే హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియానికి తరలించినట్టు విద్యార్థులు చెప్పారు. అప్పటి నుంచి మంచినీళ్లు, మజ్జిగ తప్ప ఎలాంటి భోజనం, అల్పాహారం కూడా ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు నకనకలాడారు. పైగా మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫలానా వైపు టాయిలెట్లు ఉన్నాయనే బోర్డులు పెట్టకపోవడం, మొబైల్ టాయిలెట్ వెయికిల్స్ ఏర్పాటు చేయకపోవడంతో పంటి బిగువున సభ అయ్యేంత వరకూ విద్యార్థినులు ఓపికతో వేచి చూశారు. గేట్ నంబర్ 6లో ఉన్న ఒక్క టాయిలెట్ విద్యార్థినులతో కిక్కిరిసిపోయింది. దానిని శుభ్రం చేసే నాథుడు లేకపోవడం దుర్వాసనలోనే ముక్కులు మూసుకుంటూ.. ఎటు వెళ్లాలో తెలియక అమ్మాయిలు, ఉద్యోగాలకు ఎంపిక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలు ముఖ్యమంత్రి మంత్రి సభకు.. గురుకుల విద్యార్థులకు సంబంధం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఔను; మేం నోటిఫికేషన్లు ఇవ్వలేదు!

- బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన నియామకాలే పూర్తి చేస్తున్నాం
- శాసనసభ సాక్షిగా ఒప్పుకొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): 'ఔను, మేం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్ల నియామకాలను ఇప్పుడు చేపడుతున్నాం' అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తాము గానీ, తమ సీఎం గానీ ఎక్కడా నోటిఫికేషన్లు ఇచ్చినట్టు చెప్పలేదని కుండ బద్దలు కొట్టారు. ఈ మేరకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన నియామకాలకు ఇప్పుడు పత్రాలు అందిస్తూ.. ఆ నియామకాలను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంటున్నదని చురకలు అంటించారు. దీనిపై స్పందించిన మంత్రి పొన్నం... తాము నోటిఫికేషన్లు ఇవ్వలేదని ఒప్పుకొంటూనే 'బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నిన్ననే వార్నింగ్ ఇచ్చాం.. అయినా వారు మారడం లేదు' అన్నారు.

ప్రతితండాలో ప్రభుత్వ పాఠశాల

- పంచాయతీ భవనాలు నిర్మిస్తాం
- అందరూ సంత్ సేవాలాల్ బాటలో నడవాలి
- ఆప్షనల్ హాలిడేగా సంత్ సేవాలాల్ జయంతి
- ఏటా సేవాలాల్ ఉత్సవాలకు 2కోట్లు
- జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్

హైదరాబాద్ సిటిబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): ప్రతి తండా గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీ భవనాలు నిర్మించి ఏడాదిలోపే వాటిని ప్రారంభిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. బంజారాహిల్స్‌లోని బంజారాభవన్‌లో గురువారం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. చదువుకున్నప్పుడే సమాజంలో గౌరవం ఉంటుందని చెప్పారు. చదువే అభివృద్ధి పథం వైపు నడిపిస్తుందని అన్నారు. సంత్ సేవాలాల్ సూచించిన సన్మార్గంలో అందరు నడవాలని సూచించారు. సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణకు రూ.కోటికి అదనంగా మరో కోటి రూపాయలు విడుదల చేస్తామని చెప్పారు. ఇందుకు తక్షణమే జీవో మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతిని ఆప్షనల్ హాలిడేగా కూడా నిర్ణయించామని చెప్పారు. కరెంటు, తాగునీరు ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు.

'గురుకుల' పోస్టుల్లో గోల్‌మాల్!

- రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు తిలోదకాలు?
- జోనల్ పోస్టులు మల్టీ జోనల్‌గా భర్తీ!
- పోస్టులు లేకున్నా స్కూల్ పీడీలుగా ఆరుగురు నాన్‌లోకల్ అభ్యర్థులు
- ఆ ఆరుగురు కూడా ఏపీ వాసులే
- నోటిఫికేషన్‌కు విరుద్ధంగాఎంపిక
- ఆందోళనలో పీడీ అభ్యర్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి15 (నమస్తే తెలంగాణ): గురుకుల స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీలో గోల్‌మాల్ జరిగినట్టు తెలుస్తున్నది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని, జోనల్ పోస్టులను మల్టీజోనల్‌గా నింపినట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. నోటిఫికేషన్‌కు విరుద్ధంగా అనర్హులను ఎంపిక చేసినట్టు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో మొత్తంగా తొమ్మిది క్యాటగిరీల్లో అంటే పీజీటీ 1,276, టీజీటీ 4,020, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్ 2,876, టీజీటీ స్కూల్ లైబ్రేరియన్ 434, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ 275, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ 226, మ్యూజిక్ టీచర్ 124 పోస్టులు.. ఇలా మొత్తం 9,231 పోస్టుల భర్తీ ప్రక్రియను తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ట్రిబ్) చేపట్టింది. వాటిలో టీజీటీ, స్కూల్ పీడీ, లైబ్రేరియన్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టులు జోనల్ పోస్టులు కాగా, గురుకుల డీఎల్, జేఎల్, పీజీటీ పోస్టులు మల్టీ జోనల్ పోస్టులు. అందుకనుగుణంగానే ట్రిబ్ జోనల్ పోస్టులకు అభ్యర్థుల నుంచి జోన్లవారీగా, సొసైటీలవారీగా ఆప్షన్లను ట్రిబ్ స్వీకరించింది. కానీ, ప్రస్తుతం జోనల్ పోస్టుల భర్తీని అందుకు విరుద్ధంగా చేపట్టిందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై ట్రిబ్‌ను సంప్రదించినా కనీస స్పందన కరువైందని వాపోతున్నారు. దీంతో 'నమస్తే తెలంగాణ'ను సంప్రదించి అనేక మంది అభ్యర్థులు తమ గోడు వెల్లబోసుకున్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు తిలోదకాలు

రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జోన్/సొసైటీలోని పోస్టుల్లో 95 శాతం లోకల్ వారికి, ఐదు శాతం నాన్‌లోకల్ వారికి కేటాయించాల్సి ఉంటుంది. ఇక జోన్‌ను యూనిట్‌గా తీసుకున్నా, జిల్లాను యూనిట్‌గా తీసుకున్నా, రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకున్నా ఇదే నిబంధనను పాటించాల్సి ఉంటుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా ఉన్నాయి. కానీ, ప్రస్తుతం ట్రిబ్ అందుకు విరుద్ధంగా జోనల్ పోస్టులను భర్తీచేసినట్టు తెలుస్తున్నది. గురుకుల స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టు జోనల్ పోస్టుగా నిర్ధారించారు. అన్ని జోన్లు, సొసైటీలు కలిపి మొత్తం 275 పోస్టులు ఉన్నాయి. ఇక్కడ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం జోన్‌నే కాకుండా సొసైటీని యూనిట్‌గా తీసుకుని పోస్టులను భర్తీ చేయాల్సి ఉన్నది. సొసైటీల వారీగానే కాకుండా, జోన్లవారీగా చూసుకున్నా నాన్‌లోకల్ అభ్యర్థులకు ఒక్క పోస్టు కూడా దక్కదు. కానీ ఏకంగా ఆరు నాన్‌లోకల్ అభ్యర్థులకు ట్రిబ్ పోస్టింగ్‌లు ఇచ్చిందని అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరుగురు కూడా ఏపీకి చెందిన వారుకావడంపై భగ్గుమంటున్నారు. ఒక జోన్‌లో 20 పోస్టులకు పైబడి ఉంటేనే నాన్‌లోకల్‌కు ఒక పోస్టు వచ్చే అవకాశముందనేది అభ్యర్థుల వాదన. అలా చూసినా కూడా నాన్‌లోకల్ అభ్యర్థులకు ఒక్క పోస్టు కూడా వచ్చే అవకాశం లేదు. కానీ, ఏకంగా ఏపీకి చెందిన ఆరుగురిని నాన్‌లోకల్ అభ్యర్థులుగా ట్రిబ్ ఎంపిక చేసిందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మొత్తంగా జోన్ల వారీగానే నాన్‌లోకల్ అభ్యర్థులకు పోస్టింగ్‌కు అవకాశం లేకపోగా, జోన్‌లోని సొసైటీలవారీగా చూస్తే అందుకు ఎంతమాత్రం అవకాశం లేదు. కానీ, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీలో ఏకంగా రెండు పోస్టులను నాన్‌లోకల్ అభ్యర్థులతో భర్తీ చేసిందని, ఇదెలా సాధ్యమైందని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. జోనల్ పోస్టులైన స్కూల్ పీడీ పోస్టులను కూడా మల్టీ జోనల్ పోస్టులుగానే భావించి ట్రిబ్ భర్తీ చేసిందని అభ్యర్థులు వాదిస్తున్నారు.

అభ్యంతరాలుంటే ఇవ్వండి: ట్రిబ్

పీడీ స్కూల్ అభ్యర్థుల ఆరోపణల నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' ట్రిబ్ అధికారులను సంప్రదించింది. ఈ సందర్భంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారమే నియామకాలు జరిగాయని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చని, వాటిని పరిశీలిస్తామని వెల్లడించారు. అయితే తాము అడిగితే మాత్రం ఏ సమాధానమివ్వడం ఇవ్వలేదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

జాబితాలో అనర్హులు

వాస్తవంగా స్కూల్ పీడీ పోస్టులకు ట్రిబ్ గత ఏప్రిల్ 24 నుంచి మే 24 వరకు దరఖాస్తులను స్వీకరించింది. నోటిఫికేషన్ ప్రకారం 5 ఏప్రిల్ 2023 నాటికి పీడీ పోస్టులకు సంబంధించిన అన్ని పరీక్షలు పాసైన అభ్యర్థులే అర్హులని ప్రకటించింది. ఆ లెక్కనే గత మే నాటికే అభ్యర్థులు ఆయా విద్యార్హతలను సాధించి ఉండాలి. కానీ, ప్రస్తుతం ట్రిబ్ నోటిఫికేషన్‌కు విరుద్ధంగా గత అక్టోబర్‌లో పాసైన అభ్యర్థికి పోస్టింగ్ ఇచ్చిందని అభ్యర్థులు వెల్లడిస్తున్నారు. చార్మినార్‌లో జోన్‌లో పీడీ పోస్టుకు అభ్యర్థి (హాల్ టిక్కెట్ నంబర్ 2302070434) నోటిఫికేషన్ సమయానికి బీపీఎడ్ ఉత్తీర్ణులు కాలేదు. గత అక్టోబర్‌లో నిర్వహించిన బ్యాక్‌లాగ్ సెమిస్టర్‌లో ఉత్తీర్ణత సాధించాడు. కానీ, ప్రస్తుతం ట్రిబ్ పోస్టింగ్ ఇచ్చింది. దీనిపై ట్రిబ్ అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎంత మంది ఉన్నారోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. డెమో మార్కులను ట్రిబ్ అధికారులు ఇష్టారాజ్యంగా వేశారని పీడీ అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

గురుకులాల్లో బదిలీలు చేపట్టాలి

ట్రైటా, స్టాఫ్ అసోసియేషన్ డిమాండ్

రుషీకేశ్ కుమార్

ప్రభుదాస్

హైదరాబాద్, ఫిబ్రవరి15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం వెంటనే అన్ని గురుకులాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను చేపట్టాలని తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయ సంఘం (ట్రైటా) రాష్ట్ర అధ్యక్షుడు రుషీకేశ్ కుమార్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రమోషన్లు, ఇవ్వకుండానే పోస్టుల భర్తీ చేపట్టడం వల్ల గురుకుల టీచర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇదేవిషయమై ఇటీవల ప్రజాభవన్‌లో ధర్నాకు దిగారని గుర్తుచేశారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చిందని, ఎంపికైన నూతన గురుకుల ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వకుండా కేవలం ఆయా గురుకుల సంస్థలకు మాత్రమే కేటాయిస్తూ నియామక పత్రాలను ఇచ్చిందని పేర్కొన్నారు.

వైసీపీ నేతలపై వైఎస్ షర్మిల ఫైర్

ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను అడగడంపై మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా మరో రెండేండ్లు పొడిగించాలన్న ఏపీ వైసీపీ నేతలపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇన్ని రోజులు ఏం చేశారని ప్రశ్నించారు. గురువారం ఆమె విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేండ్లు అధికారమిస్తే విభజన హామీల్లో ఒక్కటంటే ఒక్క దానిని కూడా నెరవేర్చలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రాజధాని లేదని, ప్రత్యేక హోదా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేండ్లలో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాలేదని, ఉన్నవి కూడా ఉంటాయో? లేదో? తెలియదని అనుమానం వ్యక్తం చేశారు. రూ. 8 లక్షల కోట్లు అప్పుచేసి రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారు తప్పితే, అభివృద్ధి చేయలేదని ధ్వజమెత్తారు. అమరావతి పేరుతో చంద్రబ